# అపకీర్తి

'సరిగ్గా సంవత్సరం అయింది; ఏదో పార్టీలో కలుసుకున్నాం. అప్పుడు మీరు నాకో మాట చెప్పారు, మీకు గుర్తు వుందో లేదో గాని' అంది వసుంధర ఐస్‌క్రీం తింటున్న గుంపు నుంచి తప్పించుకుని కీర్తి ఒక్కడే నిలబడివున్న చోటుకు వచ్చి.

కీర్తి తెల్లముఖం వేశాడు. అయితే ఒక్క క్షణంలోనే ముఖకవళికలు మార్చివేశాడు. ఆమె వయిపు నవ్వుతూ చూచి 'నమస్కారం... గుర్తులేకేం; భేషుగ్గా వుంది' అన్నాడు.

'ఎట్లా వున్నాయి మీ నూకలు?' అంది మళ్ళీ ఆమె - వసుంధర. ఈ మారు ఆమె మాటలలో ఇదివరకటి నిష్ఠూరం లేదు. కాస్తోకూస్తో ఎగతాళి, వ్యంగ్యం, వేళాకోళం మిళాయించి వున్నాయి.

'ఆ మాట కూడా గుర్తుంచుకున్నారే!' అన్నాడు కీర్తి.

'తెలుగు నుడికారం నాకు అంతగా తెలియకపోయినా చాలా ఇష్టం అని ఆరోజే చెప్పాను గదూ! నూకల కేం ఖర్మ, ఐస్‌క్రీంలు, కేకలు లక్షణంగా ఊదిపారేస్తారని చెప్పాను ఆరోజే. కనీసం నా మాట అయినా అబద్ధం కాలేదు. అందుకు సంతోషంగా వుంది. పోనీండి, సెలవు -' అంది వసుంధర. ఆమె వెళ్ళిపోతుందేమోనని భయం పట్టుకుంది కీర్తికి.

'మీరు క్షమించాలి. కాస్త టైం యిస్తే-'

'యిందులో క్షమించాల్సిందీ యివ్వాల్సిందీ ఏమీలేదు, కీర్తిగారూ, ఇప్పుడు తీరికూర్చుని యింకో అబద్ధం కల్పించకండి. పార్టీ హాయిగా ఎంజాయ్ చేయండి' అంది వసుంధర.

'పార్టీలు, జీవితాలు బొత్తిగా బోర్‌గా తయారవుతున్నాయండీ, అందుకని-'

'పోయినసారి మనం కలుసుకున్న పార్టీ చివరలో - అంత బోర్ అనిపించలేదనుకుంటాను - మీకు -'

'మీ సహాయానికి థాంక్స్'

'యిద్దరమూ క్షమార్హులమే లెండి'

'మరీ ఇంత తేలికగా తీసుకోగూడదు మీరు. అప్పుడు అంతమంది లోనూ

అంతటియైన అబద్ధం ఆడటానికి మిమ్మల్నే యెందుకు ఎన్నుకున్నాననుకున్నారు? మిమ్మల్ని చూడగానే నమ్మకస్తులనీ, ఆ మాట యెవరికి చేరాలో వారికి చేరి తీరుతుందనీ విశ్వాసం యేర్పడింది.'

'పోన్లెండి. డాక్టర్లు పొరబడ్డారని ఇప్పుడు మరో అబద్ధం కల్పించకుండా ఒప్పుకున్నారు. అంతేచాలు...' అంది వసుంధరం.

కొరడాతో కొట్టినట్లు అయింది కీర్తికి. నా బదులు ఈవిడే మూడు నెలలలో పోయినట్లయితే బాగుండేది అనిపించింది అతని మనసుకు.

◆◆◆

సంవత్సరం క్రితం యేం జరిగిందో వడివడిగా అతని మనసులో మెదిలింది.

'యిప్పుడే అందినవార్త' అన్నాడు వసుంధరతో. ఆమెతో అప్పుడే ఆ పార్టీలోనే పరిచయం చేసుకున్నాడు. రామలక్ష్మికి ఎక్కడో సన్మానం జరుగుతున్న పార్టీ అది. తను ఆలస్యంగా వెళ్ళాడు. అప్పటికే ఆహూతులంతా అందిన సరుకులు అందినట్లుగా ఊదిపారేస్తున్నారు.

వసుంధర ఠీవి, దర్జాగా నడవడం, హుందాగా పలుకరిస్తూ తల ఊపుతూ అటు ఇటూ తిరుగుతుడూ వుండడం అతనుహాల్లోకి అడుగుపెట్టిన మొదటి రెండు నిమిషాలలోనే పసిగట్టాడు.

ఎవరామె? అని అడిగాడు - తెలిసిన ఆసామీని.

'నీకు తెలీదూ' అన్నట్లు ముఖంపెట్టి ఆమె సమాచారం అంతా అందించాడు.

'వసుంధర.. వసుంధర...' అనుకున్నాడు, మనస్సులోనే ఆప్యాయంగా. ఆమె వయిపు నడిచి పలుకరింపుగా నవ్వి మాటల మధ్యలో అన్నాడు; 'జీవితం ఎంతో ఆనందదాయకం అయినమాట వాస్తవమే. కాని మేడమ్ నాకు భూమి మీద నూకలు నిండుకుంటున్నాయి. ఇంకా మూడునెలలు మాత్రమే.'

ఆమె ముఖం వయిపు గుచ్చి చూచాడు ఆసక్తిగా.

తను ఆశించిన మార్పుయేమీ రాలేదు. అర్థం కానట్లు, ప్రశ్న వేస్తున్నట్లు పెట్టింది ముఖం.

'అంతేనండీ! అబద్ధం కాదు. యిప్పుడే అందిన వార్త. యింకా యింటికి వెళ్ళి మా ఆవిడతో కూడా చెప్పలేదు. రెండు రోజుల క్రితం బలవంతంగా డాక్టర్ దగ్గరకు తీసుకువెళ్ళింది ఆవిడే. ఈ సాయంత్రం ఆఫీసు నుంచి సరాసరి డాక్టర్ దగ్గరకు వెళ్ళి 'రిపోర్టు కలెక్ట్' చేసుకున్నాను స్వయంగా. ఇంకా ఇంటికి వెళ్ళలేదు. ఇంటికి వెడతానో లేదో కూడా! ఏ ముఖంతో వెళ్ళను."

కీర్తి ముఖమంతా విచారంపులుముకున్నాడు.

'నేనింకా మూడునెలలు బతికితే గొప్ప విషయం! తొంభయి ఒకటోరోజు ఖచ్చితంగా

నాదికాదు-' అన్నాడు.

వసుంధర ముఖంలో గొప్ప 'రిలీఫ్' కనిపించింది. అతనికి ఆశ్చర్యం అనిపించింది. ఆమె పడి పడి నవ్వుతోంది. 'ఓహ్.... ఓహ్... తెలుగు సరిగా రాక పోవడం నాదే పొరపాటు. నూకలు అంటే అదా అర్థం.. క్షమించండి నవ్వుతున్నందుకు' అంది ఆమె ఎపాలజిటిక్‌గా.

'యిప్పుడు ఇంటికి ఎట్లా వెళ్ళేది చెప్పండి. ఆమె ముఖం, పిల్లల ముఖం యెలా చూసేది? ఈ మాట వాళ్ళకు చెప్పాలా వద్దా? మీరే సలహా ఇవ్వాలి....' అంటూ వసుంధర మీద పెద్ద భారం వేశాడు.

వసుంధరకు అంతరంగంలో చాలా ఆనందం అయింది. అదే తన భర్త అయితే యేంచేసేవాడో? ఏమీ అనుమానం లేదు. ఆయన తనతో యే సంగతి మనసువిప్పి మాట్లాడేవాడు కాదు. డాక్టర్ ఆయనకు యిలాంటి సమాచారం అందజేస్తే - తనతో చెప్పకుండానే - ఓ రాత్రిపూట నిద్రలోనే అలా యీ ప్రపంచం నుండి తప్పించుకు వెళ్ళిపోయేవాడో. ఈ 'కీర్తి' ఎంత మంచివాడో! భార్యతో కూడా పంచుకోని విషయం ముందుగా తనతో చెబుతున్నాడు.

వసుంధరకు తన భర్త విషయం గుర్తుకువచ్చి మనసంతా రాయిలా అయిపోయింది. ఏం మనిషి! ఒక మాట లేదు. పలుకులేదు. సరదాగా కబుర్లు చెప్పుకోవడం అనేదే ఎరగకుండా ఆయన జీవితం తెల్లవారిపోయింది. ఊఁ...... అయిపోయిందిగా... యిప్పుడు యీ చక్కటి పార్టీలో యింతమంది మనుషుల మధ్య మనసువిప్పి హాయిగా మసలుకొంటున్న స్త్రీ-పురుషుల మధ్య.... ఆ మనిషి ప్రసక్తి ఎందుకు?

'నిజంగానా? యేమిటసలు వ్యాధి?' అంది కీర్తిని కాస్త సముదాయించడం మంచిదని తోచి.

-కీర్తి పదినిమిషాలపాటు చెప్పాడు; ఎన్నో వివరాలు - ఆఖరుకు మట్టుకు అదే ముక్క.

మూడునెలల తర్వాత ఈ భూమి మీద 'కీర్తి' అనే వ్యక్తి వుండడు....

ఆఫీసువాళ్ళు మరో మనిషిని 'రిక్రూట్' చేసుకుంటారు. జనాభా లెక్కల్లో తన పేరు కొట్టేస్తారు.

కాని ప్రపంచం మామూలుగా నడిచిపోతుంది. ప్రపంచంలో తను మాత్రం వుండడు.

తను లేని ప్రపంచాన్ని ఊహించుకుని కీర్తి రకరకాలుగా దిగులు పెంచుకుంటున్నాడు. ఇదంతా యేమయిపోతుంది? ఏమయిపోతుందో చూడడానికి తను వుండడు. తనకిక యెట్లా తెలుస్తుంది?

వసుంధర మనస్సు కూడా ఖేదంతో నిండిపోయింది. 'సమస్యలు బాధలు కష్టాలు ఇతరులతో కలబోసుకోకపోతే వ్యాధులు వస్తాయి. 'లోపలి మనిషి' ఎదగడానికి, బాగా

వికసించటానికి శరీరం చోటు యివ్వకపోతే వ్యాధులు వస్తాయి... వ్యాధి మరణానికి దారి తీస్తుంది..' అని యేదో పుస్తకంలో చదివింది పూర్వం.

'ఎదురుగా మనిషి ఉంటే నిశ్శబ్దముగా కూర్చుంటారు?' అని సాధించేది తన భర్తను.

'ఇద్దరున్నప్పుడే నిశ్శబ్దం సాధ్యం చేసుకోవాలి.... ఒక్కడే ఉన్నప్పుడు ఎలాగూ తప్పదుగా....' అనేవాడు ఆ మానవుడు. నవ్వాలో యేడవాలో తెలిసేది కాదు తనకు.

'పూర్తి చేయాల్సిన పుస్తకాలు యేమయినా వున్నాయా?' అనడిగింది ఆమె.

'అది పూర్తికాకపోతే సృష్టికి యేమీ లోపం లేదులెండి' అన్నాడు కీర్తి. అంటూనే మరోకప్పు ఐస్‌క్రీం తెచ్చుకుందుకు టేబుల్ దగ్గరకు వెళ్ళాడు. ఆ వెళ్లినవాడు అలా మరో గుంపులో కలిసిపోయాడు.

వసుంధర అతనలా దూరం అవడం గమనించి హాల్లోంచి లోపలి గదిలోకి వెళ్ళింది. ఆ గదిలోనే ఆఫీసు టెలిఫోన్ ఉంది. టక టక డైరెక్టరీ తిప్పి కీర్తి నెంబర్ పట్టుకుంది. డయల్ చేయగానే ఎవరో పలికారు. ఆడగొంతు.

హాలులో అంత దూరం నుంచి వసుంధర ఏం చేస్తున్నదీ గమనిస్తూనే ఉన్నాడు కీర్తి క్రీగంట.

◆◆◆

ఎంత దారుణమయినా అలాంటి అబద్ధం ఆడకూడదు.

అవును, తథాస్తు దేవతలు 'ఊ' అంటే కష్టం.

- వసుంధర మళ్ళీ కడుపుబ్బ నవ్వింది.

'ఈ పార్టీ కూడా బోర్‌గా వుంది. బయటికి పోదాం రండి' అన్నాడు కీర్తి.

ఆమె ఒక్క క్షణమయినా యోచన చేయకుండా 'పదండి' అంది.

ఆ రోజు టెలిఫోన్ చేయడం అతను గమనిస్తూనే ఉన్నాడని తనకు తెలుసునని అతనికి తెలియచెప్పడం అవసరం అనుకుంది వసుంధర.

ఈ సంవత్సరంలో అతను ఆ మాత్రం ఊహించలేకుండా వుంటాడా?

*ఆంధ్రపత్రిక-ఆదివారం-డిసెంబర్, 1993*

◆